సాక్షి
వనపర్తి

ఆదివారం । 17 । ఆగస్టు । 2025



పసందైన పాలకోవా

ఉండవల్లి మండలం బొంకూరులో ఓ కుటుంబం ఆరు దశాబ్దాలుగా పాలకోవా తయారు చేస్తూ గుర్తింపు దక్కించుకుంది.

-8లో ▸



జూరాలకు వరద

జూరాల జలాశయానికి శనివారం 95 వేల క్యూసెక్కుల వరద రాగా ఆరు క్రస్ట్ గేట్లు పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.6/22.3

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫర్టిలైజర్ దుకాణ యజమానికి నోటీసు జారీ

అమరచింత: మండలంలోని చింతరెడ్డిపల్లిలో ఉన్న ఆంజనేయ ట్రేడర్స్ ఫర్టిలైజర్ దుకాణ యజమానికి శనివారం షోకాజ్ నోటీసు అందించినట్లు ఏడీఏ దామోదర్ తెలిపారు. యూరియాను అధిక ధరకు విక్రయించడంతో పాటు కచ్చితంగా గుళికల మందు కొనుగోలు చేయాలంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో ముందస్తుగా నోటీసు జారీ చేసినట్లు చెప్పారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి నివేదిక ఇవ్వాలని ఏఓ అరవింద్‌ను ఆదేశించామన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి



వనపర్తి రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శనివారం పెబ్బేరు వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, అష్టోత్తరం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి భగవద్గీత పఠనం చేశారు. అనంతరం పట్టణ వీధుల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆర్యవైశ్య మహిళలు భారీగా ఊరేగింపు నిర్వహించారు. ర్యాలీలో కోలాటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం ఆలయంలో మహిళలు శ్రీకృష్ణుడి తులాభారం నిర్వహించి ఉట్టికొట్టి, మహా మంగళహారతి చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శనేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో ఉన్న శనేశ్వరాలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఏలినాటి శనిదోష నివారణ పూజల నిర్వహణకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరునికి తిలతైలాభిషేకం, పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. అనంతరం ప్రదక్షిణ, నందీశ్వర దర్శనం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఆలయ అర్చకులు శాంతికుమార్, ఉమా మహేశ్వర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కష్టాలు..!

దుకాణాల వద్ద అన్నదాతల పడిగాపులు



అమరచింత ఆగ్రో రైతు సేవాకేంద్రం వద్ద శనివారం వరుసలో నిల్చొన్న రైతులు

- ఎకరాకు రెండు బస్తాలు అంటున్న అధికారులు
- పట్టాదారు పాసు పుస్తకానికి రెండు ఇస్తామంటున్న దుకాణదారులు
- వానాకాలం సాగుకు 26 వేల మె.ట. అవసరమని అధికారుల నివేదిక
- 19 వేల మెట్రిక్ టన్నులే అందిస్తామంటున్న ప్రభుత్వం
- ఇప్పటి వరకు జిల్లాకు చేరింది 13 వేల మె.ట. మాత్రమే..
- జిల్లాలో వానకాలం సాగు అంచనా 2.75 లక్షల ఎకరాలు

అమరచింత: వానాకాలం పంటలు సాగుచేసిన రైతులు పొలాల్లో చల్లేందుకు యూరియా కావాలంటూ ఫర్టిలైజర్ దుకాణాల ఎదుట పడిగాపులు పడుతూ అందినకాడికి తీసుకెళ్తున్న పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. యూరియా సరిపడా అందడం లేదంటూ రైతులు రెడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నా.. అధికారులు మాత్రం సరిపడా నిల్వలు ఉన్నాయని, ఆందోళన వద్దంటూ ప్రకటనలిస్తున్నారు. కాగా సరైన సమయానికి యూరియాను సరఫరా చేయలేక పోతున్నారని రైతన్నలు ఆరోపిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వానకాలం వరిసాగు 2.75 లక్షల ఎకరాలు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేసి 26 వేల మెట్రిక్ టన్నులు అవసరమని ప్రభుత్వానికి నివేదిక అందించారు. కానీ ప్రభుత్వం జిల్లాకు కేవలం 19 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేస్తున్నామని చెప్పడంతో జిల్లా వ్యవసాయ అధికారులు మిగిలిన యూరియా కోసం మరోమారు ప్రభుత్వానికి నివేదించనున్నారు. సకాలంలో యూరియా పంటలకు అందించకుంటే నష్టపోయే ప్రమాదం ఉందని.. ఎకరాకు రెండు బస్తాల చొప్పున సరఫరా చేయాలంటున్నారు రైతు సంఘాల నాయకులు.

2020 గణాంకాల ప్రకారం..

జిల్లాలో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతున్నందున అధికారులు ప్రతి సంవత్సరం పంటలకు సరిపడా యూరియా తెప్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారు. ఈసారి 2020 సంవత్సరం నుంచి 2024 సంవత్సరం వరకు ఎంత మేర యూరియా దిగుమతి చేసుకున్నారనే గణాంకాలను పరిశీలించి సరఫరాకు సిద్ధమయ్యారు. 26 వేల మెట్రిక్ టన్నులు అవసరమని ప్రతిపాదనలు పంపితే కేవలం 19 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారని జిల్లా అధికారులు చెబుతున్నారు.

సొసైటీలు, ఆగ్రో రైతు సేవాకేంద్రాలకు కేటాయింపు..

యూరియాను జిల్లాలోని అన్ని ఫర్టిలైజర్ దుకాణాలకు కేటాయించకుండా కేవలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవాకేంద్రాలకు మాత్రమే సరఫరా చేస్తుండటంతో రైతులు నిత్యం ఆయా కేంద్రాల వద్ద బారులు తీరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధిక ధరలకు విక్రయిస్తే ఆయా కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని.. ప్రస్తుతం వీటికి మాత్రమే సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మండలానికి కేవలం రెండు, మూడు కేంద్రాల్లోనే యూరియా లభిస్తుండటంతో అన్ని గ్రామాల రైతులు అక్కడికే తరలి రావడంతో కిటకిటలాడుతున్నాయి. వచ్చిన నిల్వలు సరిపోక పలువురు రైతులు నిరాశతో వెనక్కి తిరిగి వెళ్తున్న పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో యూరియా పంటలకు అందుతుందని.. అందుకే యూరియా బస్తాల కోసం పడిగాపులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



పట్టణ శివారులో 4 ఎకరాల్లో వరి సాగుచేశా. ఎకరాకు రెండు బస్తాల యూరియా చల్లాలని.. 8 బస్తాలు ఇవ్వమని ఆగ్రో రైతు సేవాకేంద్రానికి వెళ్తే పట్టాదారు పాసు పుస్తకానికి రెండు మాత్రమే ఇచ్చారు. యూరి యా అందక ఇబ్బందులు పడుతున్నాం.

– కడియాల నర్సింహులు, రైతు, అమరచింత

ప్రభుత్వ వైఫల్యం..



యూరియా సకాలంలో సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఫర్టిలైజర్ దుకాణాల వద్ద గంటల తరబడి వరుసలో నిలబడే పరిస్థితి నెలకొంది. అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. 14 ఎకరాల్లో వరి సాగు చేసిన నాకు రెండు బస్తాల యూరియా ఏ మేరకు సరిపోతుంది.

– మల్లారెడ్డి, రైతు, కిష్టంపల్లి

సరిపడా సరఫరా చేయాలి..



నేను ఆరు ఎకరాల్లో వరి సాగు చేశా. కానీ యూరియాకు వెళ్తే రెండు బస్తాలు ఇస్తామంటున్నారు. పంటలకు సరిపడా ఇవ్వాలని అడిగినా సంబంధిత ఫర్టిలైజర్ దుకాణ యాజమానులు పట్టించుకోవడం లేదు. ఎకరాకు రెండు బస్తాల లెక్కన యూరియా అందించి పంట కాపాడాలి.

– ఆంజనేయులు, రైతు, కిష్టంపల్లి

అధైర్యపడొద్దు..



రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదు. జిల్లాకు 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని జిల్లా వ్యవసాయ అధికారి ప్రతిపాదనలు పంపించారు. కాగా 19 వేల మెట్రిక్ టన్నులు ఇస్తామని ఉన్నతాధికారులు ప్రకటించి ఇప్పటి వరకు 13 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. మిగతాది కూడా త్వరలోనే వస్తుంది.. రైతులకు సరిపడా సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– దామోదర్, ఏడీఏ

ధరల నియంత్రణపై పర్యవేక్షణేది?

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు వ్యవసాయశాఖ అధికారులు నిరంతరం రైతు ఆగ్రో సేవాకేంద్రాలు, సొసైటీలను తనిఖీ చేస్తున్నారు. యూరియా బస్తా ధర రూ.265 ఉండగా.. హమాలీ ఛార్జీలతో కలిపి కొందరు రూ.270, మరికొందరు రూ.285 తీసుకుంటున్నారని ఫిర్యాదులు అందుతుండటంతో వ్యవసాయ అధికారులు యూరియా పంపిణీపై దృష్టి సారిస్తున్నారు.



కొత్తకోటలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

రాష్ట్రంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ మాటలతో కడుపు నింపే పార్టీలు
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

గోపాల్‌పేట: కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మాటలతో కడుపు నింపే పార్టీలని.. ప్రజలు బీజేపీపై నమ్మకం ఉంచి ఒక్కసారి గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని మహబూబ్‌నగర్ ఎంపీ, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. గురువారం ఆమె ఏదులలోని పెద్దగుట్టపై ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ మద్దతుతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని.. తెలంగాణ ఏర్పడకముందు గొప్పలు చెప్పిన బీఆర్ఎస్, అమలుకాని ఆరు గ్యారెంటీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఇప్పుడిప్పుడే వాస్తవాలు తెలుసుకుంటున్నారని.. త్వరలోనే తెలంగాణలో బీజేపీ పాగా వేయనుందని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర నిధులు వినియోగిస్తూ కాంగ్రెస్ పథకాలుగా పేర్లు మార్చి అమలు చేస్తూ పొంగిపోతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో మహిళలకు రూ.2,500, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఏమయ్యాయని, సగం మంది రైతులకు పంట రుణమాఫీ వర్తించలేదని, నిరుద్యోగభృతి రాలేదని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం లేదని విమర్శించారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీకి చెందిన 30 మంది బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సబ్బిరెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణగౌడ్, మణివర్ధన్‌సాగర్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

వనపర్తి: జిల్లాకేంద్రంలో అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో జరిగే 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయనతో పాటు సంఘం ప్రధానకార్యదర్శి ఏ.సాంబ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాల కిందట ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా పురుడు పోసుకున్న ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం శాస్త్రీయ విద్య సాధనే లక్ష్యంగా సమసమాజ స్థాపనకు పోరాడుతోందన్నారు. విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ సమాజంలో ఉన్న వివక్షపై జరిగిన, జరుగుతున్న పోరాటాల్లో భాగస్వామ్యం అవుతున్నామని చెప్పారు. ఇంతటి చరిత్ర కలిగిన పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జిల్లాకేంద్రంలో నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడి తప్పిందని.. ప్రభుత్వ విద్యారంగంపై పాలకులు కనీస దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యలకు నిలయాలుగా మారాయని.. పరిష్కరించే నాథుడే కరువయ్యారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులిస్తూ వాటి అభివృద్ధికి ప్రభుత్వం పరోక్షంగా మద్దతునిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రియింబర్స్‌మెంట్ నాలుగేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ జరుగుతుంటే సంబంధిత అధికారుల పర్యవేక్షణ తప్పా పరిష్కార చర్యలు ఏమీ లేవని తెలిపారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ అని ఇచ్చిన హామీ హామీగానే మిగిలిందన్నారు. కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఎన్ని జరిగినా ఆయా కళాశాలపై అధికారుల చర్యలు శూన్యమేనని తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్, రంజిత్, సహాయ కార్యదర్శులు గణేష్, పవన్, రాష్ట్ర నాయకులు గణేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన తిరుమలయ్య గుట్ట



ఆలయం వద్ద స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



గుట్ట పైకి వెళ్లే మార్గంలో భారీగా నిలిచిన వాహనాలు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం శివారు తిరుమలయ్య గుట్టపై వెలిసిన తిరుమలనాథ వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, అర్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు వరుస క్రమంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా.. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేయగా, గుట్ట కింద దాతలు అన్నప్రసాద వితరణ చేపట్టారు. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో భక్తులు భారీగా తరలిరావడంతో గుట్ట పైకి వెళ్లడానికి ఘాట్ రోడ్‌లో ఇరువైపులా వాహనాల రద్దీ ఏర్పడి రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి సిబ్బందితో చేరుకొని రాకపోకలను పునరుద్ధరించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గస్తీ నిర్వహించారు. గుట్టపైన భక్తులకు కనీస వసతులు కల్పించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.



గుట్టపై భక్తుల రద్దీ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి మైనార్టీలకు 34 కుట్టు మిషన్లు మంజూరయ్యాయని తెలిపారు. అదే విధంగా సాతాపూర్, గంట్రావుపల్లి, ఖానాపూర్, కోడేరు వరకు బీటీరోడ్డు, బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.13కోట్లు నిధుల కేటాయించినట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. అదే విధంగా పస్పుల వాగు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. కోడేరుకు 76 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో మహిళలకు ఉచిత బస్సు, రైతు భరోసా, రూ.500 వందలకే గ్యాస్, రుణమాఫీ, రైతుబంధు వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, ఆర్ఐ జంబులయ్య, పంచాయతీ కార్యదర్శి రవితేజ, మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్ రావు, సింగిల్ విండో డైరెక్టర్ మహేష్‌రెడ్డి, రంగినేని జగదీశ్వరావు, మాజీ వార్డు సభ్యులు రాజు, సురేష్ యాదవ్, కురుమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు .

క్లుప్తంగా

డ్రెయినేజీలో పడి పారిశుద్ధ్య కార్మికుడి మృతి



వనపర్తి రూరల్: మండలంలోని అంకూరులో డ్రెయినేజీలో పడి పారిశుద్ధ్య కార్మికుడు మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ము రాములు(43) గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం గ్రామంలోని రైతువేదిక దగ్గర డ్రెయినేజీని శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు బోర్లపడి ఊపిరాడక మృతిచెందాడు. మృతుడి కుమారుడు కొమ్ము వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బల్మూర్: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్ వివరాల ప్రకారం.. మండలంలోని గోదల్ గ్రామానికి చెందిన బాల్‌రాం(78) ఈనెల 13న ఇంట్లోని బాత్‌రూంలో కాలుజారి కిందపడ్డాడు. దీంతో వెంటనే హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహం అందజేశారు. అతని కుమారుడు చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి



అంజలయ్య (ఫైల్)

తిమ్మాజీపేట: విద్యుదాఘాతంతో మండలంలోని మారేపల్లి చెందిన ఇప్పలపల్లి అంజలయ్య (68) మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంజలయ్య ప్రతి రోజు తెల్లవారుజామున గ్రామ సమీపంలోని కావేరమ్మ చెరువుకు కాలకృత్యాలకు వెళ్లేవాడు. యథావిధిగా శనివారం కూడా బహిర్భూమికి వెళ్లిన అంజలయ్య దారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి కుప్పకూలిపోయాడు. అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన చిన్నయ్య బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. భార్య బుచ్చమ్మ, ఇద్దరు కుమారులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి చిన్న కుమారుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యశ్రీ అధికారినని బురిడీ

అచ్చంపేట రూరల్: తాము ఆరోగ్యశ్రీ అధికారులమని ఓ మహిళను బురిడీ కొట్టించిన ఘటన అచ్చంపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మధురానగర్ కాలనీకి చెందిన ఓ మహిళకు గత నెలలో కొత్త నంబర్ నుంచి కాల్ వచ్చింది. తాను ఆరోగ్యశ్రీ అధికారినని.. మీకు ఆరోగ్యశ్రీ నుంచి రూ.15వేలు రానున్నాయని చెప్పాడు. నిజమేనని నమ్మిన ఆ మహిళ అతనికి ఓటీపీ చెప్పింది. కాల్ ముగిసిన తర్వాత చూస్తే ఆమె ఖాతాలో రూ.16వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. తిరిగి అతనికి కాల్ చేస్తే కలవలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి శనివారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ విజయభాస్కర్ కేసు నమోదు చేశారు

పసందైన.. పాలకోవా

అలంపూర్/ఉండవెల్లి: ఒక వృత్తి జీవనోపాధికి జీవం పోస్తుంది. అదే వృత్తిలో నైపుణ్య సాధిస్తే ఆ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు సొంతం అవుతాయి. అది తినబండారమైతే మరింత ప్రాచుర్యం లభిస్తుంది. అందులోనూ మిఠాయి అయితే ఈ ప్రాంతం గురించి చెప్పనక్కర్లేదు. అలాంటి పసందైన పాలకోవాకు పెట్టింది పేరుగా ఉండవెల్లి మండలం బొంకూరు పేరొందింది. ఇక్కడ ఆరు దశాబ్దాలుగా ఒక కుటుంబం పాలకోవా తయారీతో గుర్తింపు దక్కించుకుంది. ఒకప్పుడు జీవనోపాధి కోసం పాలకోవాను తయారు చేశారు. ఇప్పటికీ అదే వ్యాపారంలో రాణిస్తూ ఉపాధి పొందుతున్నారు. తెలంగాణ–ఏపీ–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ఉండడంతో ఆయా ప్రాంతాల్లోని పట్టణాల్లో బొంకూరు పాలకోవా ప్రసిద్ధిగాంచింది.

- 60ఏళ్లుగా తయారీ
- మూడు తరాలుగా జీవనోపాధి
- పాలకోవాకు ప్రసిద్ధిగాంచిన బొంకూరు
- మూడు కుటుంబాలకు రోజువారీ ఆదాయం



పాలకోవను సిద్ధం చేస్తున్న మహిళ



సిద్ధమైన పాలకోవా

సండే స్పెషల్

ఆరు దశాబ్దాలుగా తయారీ

గ్రామానికి చెందిన ఒక కుటుంబం పాలకోవా తయారీతో జీవనోపాధి పొందుతుంది. మూడు తరాలుగా ఇదే వ్యాపారంతో ఉపాధి పొందుతున్నారు. పాలకోవా తయారీ ఆ కుటుంబానికి ఉపాధి లభిస్తుండగా ఏళ్ల తరబడి నైపుణ్యం ఆ గ్రామానికే పేరు తెచ్చింది. 60 ఏళ్ల క్రితం సలాం మియ్యా–అమిర్ బీ దంపతులు జీవనోపాధి కోసం పాలకోవా తయారీని ఎంచుకున్నారు. పాలకోవాను తయారు చేసి పట్టణాలకు తరలించి రోజువారీ ఆదాయంతో ఉపాధి లభించింది. ఆ దంపతులకు నజీర్ మియ్యా, కాశీం మియ్యా, శాలిమియ్యా, రసూల్ మియ్యా నలుగురు కుమారులు. వీరిలో పెద్ద కొడుకు నజీర్ మియ్యా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. మిగిలిన ముగ్గురు కుమారులు తండ్రితో కలిసి పాలకోవా తయారు చేసి వివిధ ప్రాంతాల్లో విక్రయించారు. ఆ తర్వాత కుటుంబాలు వేర్పడినా ఎవరికి వారు పాలకోవాతోనే జీవనం సాగిస్తున్నారు. ఇలా మూడు తరాలుగా పాలకోవా తయారు చేస్తూ అందులో రాణిస్తున్నారు.

నాణ్యతలో రాజీలేకుండా..

మూడు తరాలుగా పాలకోవాతో ప్రసిద్ధి గాంచిన ఆ కుటుంబం నాణ్యతలో రాజీపడకుండా స్వచ్ఛమైన పాలకోవాను తయారు చేస్తున్నారు. పాలకోవాకు పాలపాకెట్లు కాకుండా గ్రామంలో పాడిరైతుల నుంచి బర్రెపాలను సేకరిస్తారు. ఆ తర్వాత కట్టెల పొయ్యిపైనే తయారు చేస్తారు. బర్రెపాల ఖరీదు పెరిగినప్పటికీ తమ లాభాలు తగ్గించుకొని స్వచ్ఛమైన పాలకోవాను సిద్ధం చేస్తున్నారు. పాలకోవ తయారీలో కుటుంబం మొత్తం భాగస్వాములవుతారు.

ఇంట్లో తయారీ.. పట్టణాల్లో విక్రయం

పాలకోవాను ఇంట్లోనే సిద్ధం చేస్తారు. ఉదయం పాలసేకరణ అనంతరం కట్టెలపొయ్యిపైనే పాలకోవాను తయారు చేస్తారు. ఆ తర్వాత కర్నూల్, అయిజ, శాంతినగర్, అలంపూర్ వంటి ప్రాంతాల్లో విక్రయిస్తారు. మిఠాయి, ఇతర దుకాణాలకు సైతం పాలకోవాను సరఫరా చేస్తున్నారు. ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాలకోవాను విక్రయిస్తారు. ఇళ్లు అలంపూర్– రాయచూరు రోడ్డుమార్గంలో ఉండడంతో ఈ మార్గాన ప్రయాణించేవారు కొనుగోలు చేస్తారు. పట్టణాల్లో సైతం వీళ్లు తయారు చేసే పాలకోవాను నిరంతరం కొనుగోలు చేసే వినియోగదారులు, ఉద్యోగులు ఉన్నారు.



పాలకోవను డబ్బాలలో నింపుతున్న దృశ్యం

60 ఏళ్ల క్రితం ప్రారంభించాం



60 ఏళ్ల క్రితం నా భర్త సలాం మియ్యా పాలకోవా తయారీని ప్రారంభించారు. వ్యాపారం చేయడానికి డబ్బులు లేవు. దీంతో తక్కువ పెట్టుబడితో ఏదైనా వ్యాపారం చేద్దామని పాలకోవాను తయారు చేశాం. అప్పటి నుంచి పాలకోవాతోనే నా కుమారులు ఉపాధి పొందుతున్నారు. – అమీర్ బీ, బొంకూరు

నాణ్యతగా తరయారు చేస్తాం



మూడు తరాల నుంచి పాలకోవాను విక్రయిస్తున్నాం. మా మామ దీన్ని ప్రారంభించారు. ఆ తర్వాత వారసత్వంగా మేం కొనసాగిస్తున్నాం. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. పాలకోవాకు డిమాండ్ పెరిగిందే తప్పా.. తగ్గలేదు. మా మూడు కుటుంబాలు పాలకోవాతోనే జీవనం సాగిస్తున్నాం. ఎవరికి వారు తయారు చేసుకోని వాటిని విక్రయిస్తుంటారు. – కాశీంబీ, బొంకూరు

పట్టణాల్లో విక్రయిస్తాం



గ్రామంలో పాలకోవా సిద్ధం చేసి కుటుంబ సభ్యులంతా కలిసి కిలో, అర కిలో, పావు కిలో డబ్బాల్లో నింపుతాం. ఆ తర్వాత పెద్ద పట్టణాలు, మిఠాయి దుకాణాలు, హోల్‌సేల్‌గా విక్రయిస్తాం. ఇంటి వద్దకు వచ్చే వారికి పాలకోవా అందుబాటులో ఉంటుంది. – రసుల్ బాషా, బొంకూరు

పీహెచ్‌డీ చేయాలనుకున్నాడు.. కటకటాల పాలయ్యాడు



ప్రొఫెసర్‌పై దాడి వివరాలు వెల్లడిస్తున్న వారణాసి పోలీసులు(ఫైల్)

- ఆధార్ కార్డే భాస్కర్‌ను పట్టించింది
- జూలై 28న ప్రొఫెసర్ రాంచంద్రమూర్తిపై దాడి
- ప్రొఫెసర్ల మధ్య వాగ్వాదమే దాడికి కారణం
- యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థుల నిరసనలు
- దాడి కేసు చేధించిన వారణాసి పోలీసులు



భాస్కర్ (ఫైల్)

నారాయణపేట: అసలు వారణాసిలో ఏమి జరిగిందంటూ జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వవిద్యాలయం బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) మరోసారి వెలుగులోకి వచ్చింది. తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ సీఎస్ రామచంద్రమూర్తిపై గత నెలలో జరిగిన దాడి కేసును వారణాసి పోలీసులు సీరియస్‌గా తీసుకొని .. 15 రోజుల్లోనే చేధించారు. ఈ నేపథ్యంలో అసలు ఏమి జరిగిందనే విషయం చర్చనీయాంశంగా మారింది.

అసలు కథ ...

అంతర్గత వివాదమే దాడికి దారి

ప్రొఫెసర్ రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు మధ్య జరిగిన వివాదమే దాడికి దారి తీసిందనేది వారణాసి పోలీసుల విచారణలో వెల్లడైంది. కలత చెందిన మాజీ విభాగాధిపతి తెలంగాణకు చెందిన తన ఇద్దరు పూర్వ పరిశోధన విద్యార్థులు భాస్కర్, మొద్గు కాసిం బాబుకు హెచ్‌ఓడీ తనను వేధిస్తున్నాడని, తనను పని చేయనివ్వడం లేదని తన బాధను వెలిబుచ్చుకున్నాడు. ఈ నేపథ్యంలో వారు ప్రయాగ్‌రాజ్‌లోని మహమ్మద్ కాసీం అనే పరిచయస్తుడిని సంప్రదించారు. ఈ ముగ్గురు కలిసి జూలై 25న వారణాసికి చేరుకొని కాంట్రాక్ట్ నేరస్తులను నియమించుకున్న గణేష్‌పాసిని కలిశారు. బీహెచ్‌యూ క్యాంపస్ వెలుపల ప్రొఫెసర్ మూర్తిపై దాడి చేయడమే అసలు పథకం. ముందుగా క్యాంపస్ లోపల దాడి చేయాలని నిర్ణయించుకున్నారు. కానీ కుదరకపోవడంతో.. **కట్‌చేస్తే**

ప్రొఫెసర్‌పై దాడి జరిగిందిలా..

జూలై 28న సాయంత్రం 6:30 గంటకు ప్రొఫెసర్ మూర్తి క్యాంపస్ నుంచి బ్రిజ్‌ఎన్‌క్లేవ్ కాలనీలోని ఇంటికి వెళ్తుండగా ఇద్దరు దుండగులు బిర్లా హాస్టల్ క్రాసింగ్ వద్ద ప్రొఫెసర్‌పై కడ్డీలతో దాడి చేశారు. దాడిలో ప్రొఫెసర్ రెండు చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. దాడి అనంతరం దుండగులు హైవేపై పారిపోయారు. స్థానికులు గాయపడిన ప్రొఫెసర్‌ను చికిత్స నిమిత్తం బీహెచ్‌యూ ట్రామా సెంటర్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను పట్టుకోవడానికి మూడు బృందాలను ఏర్పాటు చేశారు.

కటకటాల పాలయ్యాడు

చిన్నప్పుడే భాస్కర్ తల్లిదండ్రులను కోల్పోయాడు. పెద్దనాన్న కిష్టప్ప పోషణలో పెరిగాడు. పీజీ వరకు టాప్ ర్యాంకులో ఉత్తీర్ణుడయ్యాడు. పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో సైతం ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. పీహెచ్‌డీ పూర్తి చేయాలనుకున్న భాస్కర్ విధి రాత.. ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు పెట్టిన ఆశతో కటకటాల వైపు తీసుకెళ్లినట్లు అవుసలోనిపల్లి గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

ఆధార్ కార్డే పట్టించింది

నిందితులను సంప్రదించిన విద్యార్థుల్లో ఒకరైన భాస్కర్‌ను వారణాసి పోలీసులు నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం అవుసలోనిపల్లిలో అరెస్టు చేశారు. అతని ఆధార్ కార్డు వివరాలు వారు బసచేసిన హోటల్ నుంచి వారణాసి పోలీసులు కనుగొన్నారు. ఇదే అతని అరెస్టుకు దారి తీసింది. సీసీ ఫుటేజీలు, సెల్‌ఫోన్ డేటా, ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ప్రొఫెసర్ రాంచంద్రమూర్తిని చంపడానికి కాదని, బెదిరించడానికే దాడి చేసినట్లు, దాడి చేసే సమయంలో నేను లేను అంటూ భాస్కర్ వారణాసి పోలీసుల విచారణలో చెప్పుకొచ్చినట్లు వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కిరాయి హంతకుడు అరెస్ట్

సువావ్ ప్రాంతంలో జరిగిన వాహన తనిఖీల్లో నిందితుడు పాసిని పట్టుకున్నట్లు మీడియా సమావేశంలో డీసీపీ క్రైం శరవణన్ తెలిపారు. పోలీసులను చూసి పారిపోతుండగా నిందితుడు తుపాకీతో కాల్పులు జరపగా ఎదురు కాల్పుల్లో బుల్లెట్ పాసి కాలికి తగిలి కుప్పకూలినట్లు తెలిపారు. చికిత్స అనంతరం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

అధ్యాపకులు, విద్యార్థుల నిరసనలు

బీహెచ్‌యూ క్యాంపస్‌లో తెలుగు ప్రొఫెసర్‌పై దాడి, అధ్యాపకులు, విద్యార్థుల్లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. సంఘటన జరిగిన మరుసటి రోజు జూలై 29న ప్రొఫెసర్లు సింగ్ ద్వార్ (ప్రధాన ద్వారం) వద్ద నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. దీంతో పోలీసులు నిరసనకారుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఏసీపీతో సహా సీనియర్ అధికారులు, తక్షణ చర్య తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

జూరాలకు 95వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టు 6 క్రస్టు గేట్ల ఎత్తివేత
- ప్రాజెక్టు నుంచి 80,374 క్యూసెక్కుల నీరు దిగువకు..



జూరాల దిగువ విద్యుత్ కేంద్రం

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 95వేల క్యూసెక్కులకు వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 6 క్రస్టు గేట్లను ఎత్తి 41,112 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 38,879 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45 క్యూసెక్కులు, కుడి కాల్వకు 338 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 80,374 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.184 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు ఎగువలో 6 యూనిట్ల ద్వారా 230.683 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 273.706 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఏఈ శ్రీధర్ తెలిపారు.

సుంకేసులకు 32 వేల క్యూసెక్కులు

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 7 గేట్లను తెరిచి 30,653 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. అలాగే కేసీ కెనాల్‌కు 2,180 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అలంపూర్: రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం శనివారం కనుల పండవగా నిర్వహించారు. అలంపూర్ క్షేత్రంలోని శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామి జోగుళాంబ అమ్మవారి ఆలయ సముదాయంలో వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చక స్వాములు భక్తులకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



కర్ణాటకలోని సైదాపూర్ దగ్గర లారీ ఢీ కొట్టడడంతో నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- సైదాపూర్ వద్ద కారును ఢీకొట్టిన లారీ
- కర్ణాటక సరిహద్దులో ప్రమాదం
- మాచర్లలో విషాదఛాయలు



మాచర్లకు చెందిన పీజీ రాఘవేంద్ర



మహారాష్ట్రకు చెందిన నాగరాజు

గట్టు: మరో గంటన్నర ప్రయాణిస్తే క్షేమంగా ఇంటికి చేరుకునే వారు. తెల్లారక ముందే ఆ ఇద్దరు ప్రాణాలు సిమెంట్ (సిమెంట్ తయారి కోసం బూడిదను తీసుకెళ్లే లారీ) లారీ రూపంలో గాలిలో కలిశాయి. తెలంగాణ–కర్ణాటక సరిహద్దుల్లో రాయచూర్ జిల్లా పరిధిలోని సైదాపూర్ వద్ద కారును సిమెంట్ లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. మాచర్లకు చెందిన చేనేత వస్త్ర వ్యాపారి పీజీ రాఘవేంద్ర(42)తో పాటుగా ఇదే గ్రామానికి చెందిన అల్లుడు తొడు నాగన్న అలియాస్ నాగేశ్(50)లు మాచర్లకు చెందిన చేనేత కార్మికుడు వస్త్రా వ్యాపారి పీజీ మాసుమన్న, పీజీ రాఘవేంద్ర తండ్రీకొడుకులు సొంతకారులో రెండు రోజుల క్రితం మహారాష్ట్రలోని పూణెకు వస్త్రాల కొనుగోలు కోసం వెళ్లారు. శుక్రవారం వారు తిరుగు ప్రయాణమయ్యారు. దారిలో మహారాష్ట్రలోని షోలాపూర్‌లో మాచర్లకు చెందిన భార్యాభర్తలు ఈరమ్మ అలియాస్ జయంతి, ఆమె భర్త నాగన్న, అలియాస్ నాగేష్‌లను కారులో మాచర్లకు రావడానికి ఎక్కించుకున్నారు. వారి ప్రయాణిస్తున్న కారు తెలంగాణలోని మక్తల్ నియోజకవర్గం దాటి కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా పరిధిలోని సైదాపూర్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీ కారును ఢీ కొట్టింది. డ్రైవింగ్ సీటులో ఉన్న రాఘవేంద్ర (42)తో పాటు పక్క సీటులో కూర్చున్న మాచర్ల అల్లుడు నాగేష్(50)అక్కడికక్కడే మృతి చెందారు. కారులో వెనుక సీటులో కూర్చున్న తండ్రి పీజీ మాసుమన్న, జయంతి గాయాలతో బయట పడ్డారు. జయంతికి కాళ్లు, చేతులు విరిగాయి. ప్రస్తుతం ఆమె రాయచూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటనపై కర్ణాటకలోని సైదాపూర్ ఎస్‌ఐ వినయ్‌బడిగేర కేసు నమోదు చేసి మృతదేహాలను రాయచూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాఘవేంద్రకు భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మహారాష్ట్రకు చెందిన నాగన్నకు ఇద్దర కుమారులు ఉన్నారు. ఈ సంఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

భర్త మరణం భార్యకు తెలియకుండా..

లారీ రూపంలో మృత్యువు కబళించగా, కర్ణాటకలోని సైదాపూర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో జయంతి భర్త నాగేష్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం జయంతికి తెలియకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త పడ్డారు. కాళ్లు, చేతులు విరిగి ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోస్టుమార్టం అనంతరం రాఘవేంద్ర మృతదేహాన్ని మాచర్లకు, నాగేష్ మృతదేహాన్ని మహారాష్ట్రలోని షోలాపూర్‌కు తరలించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



మృత్యువాత పడిన భాను(ఫైల్)

జడ్చర్ల: రెండు రోజుల కిందట చేపల వేటకు వెళ్లి వరద ప్రవాహంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. పూర్తి వివరాలు.. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బోయలకుంటకు చెందిన భాను(24) మిత్రులతో కలిసి ఈ నెల 14న జడ్చర్ల వంద పడకల ఆసుపత్రి సమీపంలో ఎగువ నుంచి వస్తున్న వరదలో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని యువకుడి కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఎట్టకేలకు శనివారం సమీప ముళ్ల పొదల్లో యువకుడి మృతదేహం ఉండడాన్ని ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గుర్తించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఏడాది కిందటే వివాహమైందని మృతుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీసీఎం బోల్తా.. తప్పిన ప్రమాదం

కొత్తకోట రూరల్: ఓ డీసీఎం అదుపుతప్పి బోల్తా పడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన కొత్తకోట మండలం పాలెం సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం నుంచి హైదరాబాద్‌కు ఇనుము లోడ్ తీసుకెళ్తున్న వాహనం శనివారం తెల్లవారుజామున పాలెం బ్రిడ్జి సమీపంలోకి రాగానే బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ యాదగిరి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డీసీఎం రోడ్డుకు అడ్డంగా పడటంతో సుమారు గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, హైవే సిబ్బంది వచ్చి వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.



పాలెం సమీపంలో ప్రమాదానికి గురైన డీసీఎం